# కోరిక

ఋషి

"మీ నాన్నగారి వయస్సెంత ఉంటుంది?" ముకుందాన్ని అడిగాడు అతడి స్నేహితుడు రాఘవ.

గుర్తు తెచ్చుకోవడాని కన్నట్లుగా ఒకసారి కళ్లు మూసుకుని, కాస్సేపటికి "వచ్చే శుక్రవారానికి డెబ్బై తొమ్మిది వెళ్లి ఎనభై వస్తాయ్" అన్నాడు ముకుందం.

"పేపర్లో ఈ ఆర్టికల్ చదివేవా? ఆ వయస్సులో ఉన్నవారికి ఏదో ఒక కోరిక ఉంటుందట. కాని కొద్ది మంది అది వ్యక్తం చెయ్యరని ఇందులో రాశారు. మీ నాన్నగారికి అటువంటిదేమైనా ఉందేమో కనుక్కో" చేతిలో పేపర్‌ని ముకుందాని కిస్తూ "ఏదైనా కోరిక ఉండి అది తీరకుండా చనిపోతే వాళ్ల ఆత్మలు పై లోకాలకు వెళ్లకుండా ఇక్కడే తిరుగుతుంటాయని కూడా రాశారు" అన్నాడు రాఘవ.

"అయితే మా నాన్నగారిని అడగటానికి ప్రయత్నిస్తా...."

... బంతి ఒకటి వచ్చి మీద పడటంతో, ఉదయం తన కుమారుడికి అతని స్నేహితుడు చెప్పిన విషయాన్ని గుర్తు తెచ్చుకుంటున్న ఆనందరావు ఉలిక్కిపడ్డాడు. అతడు పార్కులో ఉన్న బెంచిపై కూర్చుని ఉన్నాడు. ఇంతలో చిన్నపాప వచ్చి "తాతయ్యగారూ! మా బంతి మీ మీద పడింది. సారీ అండీ! అది ఇచ్చేస్తే మేం ఆడుకుంటాం" అంది. ఆ అమ్మాయిని చూస్తే ముచ్చటగా అనిపించిం దతనికి; దానిక్కారణం అతనికీ, అతని కుమారుడికి కూడా కూతుర్లు పుట్టకపోవడమే.

"ఇలా రామ్మా" అని దగ్గరికి పిలిచి ముద్దు పెట్టుకుని, బంతిచ్చాడు.

"థాంక్యూ తాతయ్యా" అంటూ బుల్లి బుల్లి అడుగులు వేసుకుంటూ తన కోసం చూస్తున్న స్నేహితుల వైపు వెళ్లిపోయిందా పాప. బడి వదలగానే అక్కడికి వచ్చి ఆడుకునే చిన్నపిల్లలని చూడటం అతని దినచర్యలో ఒక భాగమైపోయింది.

ఉదయం రాఘవ అన్నమాటల గురించే ఆలోచిస్తున్న అతనికి అప్పుడు వచ్చిందా సందేహం! "ఇంతకీ తనకేమైనా కోరిక ఉందా? ఉండి తాను మరణిస్తే తన ఆత్మ ఇక్కడే ఉండి కొడుక్కి ఇబ్బందేమైనా కలిగిస్తుందా" అనుకున్నాడు మనసులో.

ముందు 'విమానం ఎక్కడం' అనుకున్నాడు కాని అది ఎందుకో నచ్చలేదు. వయస్సులో ఉన్నప్పుడు మాత్రం అతనికి సినిమాల్లో నటించాలని కోరిక ఎక్కువగా ఉండేది. అది అప్పుడు తీరకపోయినా బాగా పెద్దవాడైన తరువాత ఒక సినిమాలో చిన్న పాత్ర వేయడంతో ఆ కోరిక కూడా తీరిపోయింది.

'ఏం కోరిక ఉన్నదబ్బా!' అనుకుంటే- "సార్!" అని వినిపించడంతో, ఆ పిలుపు వచ్చిన వైపు చూశాడు. అప్పటివరకూ ఆలోచనల్లో ఉన్న ఆనందరావు చీకట్లు ముసురుకోవడం గమనించలేదు. పార్కులో లైట్లు వేసి ఉన్నాయి. "ఏం కావాలి హుస్సేన్?" అడిగాడు చనువుగా. రోజూ రావడంతో అతనితో స్నేహమేర్పడింది. అప్పుడప్పుడు ఏదైనా డబ్బులవసరం అయితే వచ్చి అడుగుతూంటాడు. అదే విధంగా ఇప్పుడూ వచ్చాడేమో అనుకున్నాడు. ఎంతకీ బదులు చెప్పకపోవడంతో "ఏమైనా డబ్బులు అవసరమా?" అని ప్రశ్నించాడు ఆనందరావు.

"అవును సార్! మా వాడికి పరీక్ష ఫీజు కట్టాలి; జీతం రాగానే ఇచ్చేస్తాను. ఒక వంద రూపాయలుంటే సర్దండి." తల వంచుకుని చెప్పాడు హుస్సేన్.

"ప్రస్తుతం నా దగ్గర లేవు. రేపు వచ్చినప్పుడు తప్పక తీసుకు వస్తాను. ఆఖరి తేదీకి ఇంకా టైమ్ ఉంది కదా?"

"ఉందండయ్యా. మీ మేలు మర్చిపోలేను" అన్నాడు హుస్సేన్. ఎందుకో తెలియదుకాని అప్పుడు అతని కళ్లల్లో నీళ్లు తిరిగాయి. "ఇంక నేను వెళ్తాను పొద్దుపోయింది. ఆలస్యమైతే కోడలు కంగారుపడుతుంది." చేతి నున్న వాచ్ చూసి బయల్దేరాడు ఆనందరావు. గేటు వరకు వచ్చి సాగనంపాడు హుస్సేన్.

పార్క్ పక్క వీథిలో ఉన్న అతడి ఇంటికి చేరుకునేటప్పటికీ టీ.వీ.లో వార్తలు వస్తున్నాయి.

"మావయ్యగారూ! చపాతీలు చేసెయ్యమంటారా?" ముందు గదిలో బట్టలు ఇస్త్రీ చేస్తున్న సుమిత్ర అడిగింది. అతడు సాయంత్రం పూట భోజనం చెయ్యడు. ఏదో ఒక టిఫిన్ చేస్తూ ఉంటాడు.

"వార్తలు చూశాక తింటానమ్మా, అబ్బాయ్ ఇంకా రాలేదా?" భుజం మీద ఉత్తరీయం తీసి అక్కడున్న స్టాండ్ మీద వేస్తూ అడిగాడు.

"ఈ రోజు కొంచెం ఆలస్యమవుతుందని పొద్దుట చెప్పారు."

"అహఁ!" అని టీ.వీ. చూడటంలో నిమగ్నమయినాడు ఆనందరావు.

"......... గుండెపోటుతో మరణించారు. ఆయన వయస్సు అరవై అయిదు సంవత్సరాలు...." న్యూస్ రీడర్ మొహం విచారంగా పెట్టుకొని ఎవరో మంత్రి మరణవార్త చెపుతున్నాడు. అప్పటివరకు యధాలాపంగా వార్తలు చూస్తున్న అతడు, ఇది వినగానే "నేనే ఎక్కువ సంవత్సరాలు బ్రతుకుతున్నట్లున్నాను. నేను పోయేలోపు తీర్చుకోవలసిన కోరిక ఏం ఉందో ఈ రాత్రికే బాగా ఆలోచించుకోవాలి" అని తీర్మానించుకున్నాడు. వార్తలు అయిపోయిన తరువాత టిఫిన్ చేసి తన గదిలోకి వచ్చి ఫాన్ వేసుకొని పడుకున్నాడు. పడుకున్నాడన్న మాటేగాని అతనికి నిద్ర రావటంలేదు. తనకి కావల్సిందేమిటో తెలియక దాని గురించి ఆలోచించి, ఆలోచించి మానసికంగా అలసిపోయిన తర్వాత అతనికి నిద్ర పట్టింది. అతనికి తనకున్న కోరిక ఏమిటో తరువాత రోజు సాయంత్రం తెలిసింది.

*** *** ***





రోజులాగే పార్క్‌కి వచ్చి కూర్చున్నాడు ఆనందరావు. అప్పటి వరకు 'తనకి తీరవలసిన కోరిక ఏమిటా' అని ఆలోచిస్తున్నా డతడు. చిన్నకుర్రవాడు ఏడుస్తూ "గట్టిగా ఊపొద్దని చెప్పాను కదా" అంటూంటే, ఏం జరిగిందా అని అటువైపు చూసిన ఆనందరావుకి చేతులకి, మోకాళ్లకి అంటుకున్న మట్టిని దులుపుకుంటూ ఏడుస్తున్న కుర్రవాడు, పక్కన ఖాళీగా ఊగుతున్న ఊయల కనిపించాయి. జరిగిన విషయం అర్థం చేసుకున్నాడు ఆనందరావు.

"ఒరేయ్! నేను గట్టిగా ఊపి నిన్ను పడేశానని నన్ను కూడా పడవేయకే" ఊయ లెక్కుతూ ముందు జాగ్రత్తగా అన్నాడు రెండవ కుర్రవాడు. "అలాగేలే" అని వాడ్ని ఊపసాగాడు మొదటి కుర్రవాడు. సరిగ్గా ఆ దృశ్యం చూసిన అతడికి కూడా ఊయలూగా లనిపించింది. అదే 'తనకి ఉన్న కోరిక' అని నిర్ణయించుకున్నాడు.

"పిల్లల కోసం వేసిన ఊయల్లో ఎనభై యేళ్ల తాను ఊగితే జనం నవ్విపోరూ! కాబట్టి అందరూ వెళ్లిపోయిన తరువాత ఒక్కడినే ఉండి ఊగితే?" తనని తాను ప్రశ్నించుకున్నాడు ఆనందరావు.

"కాని ఆ టైమ్‌లో హుస్సేన్ ఉంటాడు కదా! పైగా రాత్రిళ్లు ఊయలకున్న గొలుసులు పెనవేసి తాళం వేసేస్తాడు కూడా!! పోని హుస్సేన్‌కి విషయం చెపితే సరిపోతుంది. అతనికి అప్పుడప్పుడు సహాయం కూడా చేస్తున్నాను..." ఈ రకంగా తన కోరికని తీర్చుకునే మార్గం కోసం అన్వేషిస్తున్న ఆనందరావుకి ఆనందం వేసింది. 'తన కోరిక రెండు మూడు రోజులలో తీర్చుకోవాలని' అనుకొని, హుస్సేన్‌కి నిన్న అడిగిన డబ్బిచ్చి ఇంటికి బయల్దేరా డతడు. తనకు వచ్చిన సమస్య [?]కు పరిష్కారం దొరికినందుకో, ముందు రాత్రి సరిగా నిద్రపోనందుకో, అతడికి రోజు పడుకున్న వెంటనే నిద్ర పట్టేసింది.

పువ్వులు చుట్టిన ఊయలలో ఊగినట్టుగా అతడికి చాలా కలలు వచ్చాయి. తర్వాత రోజు అతడు, హుస్సేన్ దగ్గరికి వెళ్లి విషయం చెప్పాడు. అంతే! హుస్సేన్ గట్టిగా నవ్వుతూ "ఏమిటి సార్! ఈ వయస్సులో కూడా జోకులేస్తున్నారా?" అడగడంతో ఆనందరావుకి మెలకువ వచ్చేసింది. ప్రక్కన ఉన్న చెంబు అందుకుని మంచినీళ్లు తాగి "హుస్సేన్‌ను అడగకుండా తన కోరిక తీర్చుకోవాలి" అనుకున్నాడు.

*** *** ***

ఆ రోజు ఆనందరావు పుట్టిన రోజు. సాయంత్రం పార్క్‌కి వెళ్లినప్పుడు చిన్న టిఫిన్ బాక్స్‌లో హుస్సేన్‌కి పాయసం పట్టుకుని వెళ్లాడు. అక్కడ ఆడుకోవడానికి వచ్చిన పిల్లలందరికీ తెచ్చిన చాక్లెట్లు పంచి పెట్టి వాళ్లతో ఆడుతూ కాలక్షేపం చేశాడు. చీకటి పడుతూండటంతో పిల్లలు ఒక్కొక్కరూ వెళ్లిపోయారు. అత డొక్కడే మిగిలాడు.

ఇద్దరు కాలేజి కుర్రవాళ్లు మూల నున్న బల్ల మీద కూర్చుని బాతాఖానీ వేసుకుంటున్నారు. ఆనందరావు కాసేపు అక్కడున్న మొక్కలన్నింటిని పరికించి చూశాడు. సిగరెట్ తాగడానికి వెళ్లిన హుస్సేన్ వచ్చి, అక్కడున్న కుర్రవాళ్ల నుద్దేశించి



"బాబూ! మీరు వెళ్తే నేను తాళం వేసుకుని 'నమాజు' చేసుకోవడానికిపోతా" నన్నాడు.

"మేం తరువాత గోడ దూకి వెళ్తాం, నువ్వు తాళం వేసుకుని వెళ్లు" అని సమాధాన మిచ్చారు. ఇది అక్కడ సాధారణం కాబట్టి హుస్సేన్ పట్టించుకోకుండా ఆనందరావు దగ్గరకొచ్చి "వెళ్దాం రండి సార్!" అన్నాడు. ప్రతి శుక్రవారం కలిసి వెళ్లడం అలవాటుతో అడిగాడు.

"నే నీరోజు మరికొద్ది సేపు కూర్చుని వెళ్తాను హుస్సేన్." ఆనందరావు అలాగనడం విచిత్రంగా అనిపించింది హుస్సేన్‌కి. 'పుట్టిన రోజునాడు పెద్దవాణ్ణి ఇబ్బంది పెట్టడం ఎందుకు' అనుకుని హుస్సేన్ అతడికి తాళాలిచ్చి "మీరే గేట్‌కి తాళం వేసి, మా పక్క ఇంటిలో ఇచ్చేసి వెళ్లండి. ఇలా మీకు ఈ పని అప్పజెప్పినందుకు ఏమీ అనుకోకండి. మీకు తెలుసు కదా ఈ రోజు శుక్రవారం తప్పకుండా నమాజుకి వెళ్లాలి" ప్రాధేయపూర్వకంగా అన్నాడు.

"ఫర్వాలేదు. మీ ఇల్లు దార్లోనే కదా! నా కేమీ ఇబ్బంది లేదు కాని నువ్వెళ్లు" అన్నాడు ఆనందరావు. అతడికి 'తన కోరిక ఈ రోజు తప్పకుండా తీరుతుంద'నిపించింది. మరో అరగంట తరువాత ఆ కుర్రవాళ్లిద్దరూ ఆనందరావు వైపు చూస్తూ వెళ్లిపోయారు. అప్పటివరకూ చేతిలో ఉన్న తాళాలు లాల్చీ జేబులో వేసుకుని ఊయల వైపు నడిచాడు. ఒకసారి దాన్ని అపురూపంగా తడిమి చూసి, ఎక్కి చేతి కర్ర సహాయంతో ఊగసాగాడు. అలా ఊగుతుంటే, చల్లటి గాలి అతడిశరీరాన్ని తాకడంతో పళ్లు జలదరించినట్లనిపించింది. అప్పుడు అతడికి కలిగిన ఆనందానికి అవధుల్లేవు.

*** *** ***

టీ.వీ.లో 'చిత్రలహరి' అయిపోయినా ఇంకా తండ్రి రాకపోవడంతో "సుమిత్రా! నేను పార్క్ వరకు వెళ్లొస్తాను. నాన్నగారింకా రాలేదేమిటో" భార్యతో అన్నాడు ముకుందం. "ఇద్దరం వెళ్దాం పదండి. ఇంట్లో ఒకర్తినే ఏం చేస్తాను?" అని ఆమె అనడంతో ఇంటికి తాళం వేసి పార్క్‌కి బయల్దేరారు ఆ భార్యాభర్త లిద్దరూ. గేటు దగ్గర నిలబడ్డ వాళ్లకి పార్క్‌లో వెలుగుతున్న ట్యూబ్‌లైట్ కాంతిలో ఊయల్లో కూర్చున్న ఆనందరావు కనిపించాడు. ముకుందానికి ముందు ఆశ్చర్యం వేసినా, ఏదోఅనుమానం,అతడిలో ప్రవేశించడంతో, "నాన్నా!" అంటూ పరుగెడుతూ అక్కడికి వెళ్లాడు. సుమిత్ర, భర్తను అనుసరించింది. గాలికి మెల్లగా ఊగుతోంది ఊయల. ఆనందరావు కళ్లు ఆనందాన్ని ప్రకటిస్తున్నాయి. అంతే తప్ప అతనిలో చలనం లేదు. తన కోరికె తీరిందన్న ఆనందంతో అతడు పుట్టిన రోజునాడే మరణించాడు. పట్టువదలనన్నట్టుగా అతడి చేతులు గొలుసులను బిగించి పట్టుకున్నాయి. ●


చేయెత్తి 'జై' కొట్టు తెలుగోడా!

అనుదినమూ
స్మరించుకోవలసిన
ఎందరో పుణ్యమూర్తులను
కన్నది
మన అనుంగు తెనుగు తల్లి

ప్రతివారమూ
ఆ వారం జన్మించిన
ఒక మహా వ్యక్తి
గురించి
రేఖామాత్రంగా
గుర్తు చేసే

సరికొత్త శీర్షిక
మన మణిమాణిక్యాలు
● నవంబరు నెల 9వ తారీకు సంచికనుంచి ప్రారంభం ●